స్కెచ్

# అంతర్వాహిని

కె. రామలక్ష్మి

ఆమె వంటయింటి గుమ్మం దగ్గిర భారంగా నిల్చుని శూన్యంలోకి చూస్తోంది. పెద్దపిల్ల గర్భంలో ఉన్నప్పుడు యింత బాధ అనిపించ లేదు. శారీరకంగానూ, మానసికంగానూకూడా ఎంతో ప్రశాంతంగా వుండేది. కాని యిప్పుడో? అలాగ కాదు. తనలో తనకే తెలియని ఏదో అలజడి. ఈమారైనా తప్పకుండా కొడుకే పుడతాడు-అని నిశ్చయించుకుంది. అవును, అందుకే యీ అలజడి అంతానూ. లేకుంటే పెద్దపిల్ల యింత గొడవచేసిందా? అప్పట్లో ఏ బాధా ఎలా వుంటుందో తెలియలేదు. కాని యిప్పుడంతా తెలుసు: బ్రతుకు బాధలలో యేబాధతోటీ దాన్ని పోల్చలేం. ఆ అనుభవంలో తను ఉన్నదీ లేనిదీకూడా తెలియలేదు. ఇప్పుడదంతా జ్ఞాపకం తెచ్చుకొందామన్నా రావడంలేదు. ఏడుసంవత్సరాలు- పెద్దపిల్లకి ఏడేళ్ళు.

ఆ పిల్లతోపాటే తనూ తన ప్రత్యేకజీవితాన్ని కోల్పోయింది. తనూ భర్తా, యీపిల్లా ఒకటి. ఈ పాప పెరుగుతూ వుంటేనే తనూ పెరుగుతూ వుంది ... అంతే కాలంతోపాటే మళ్ళీ తను తానైంది. యీ పెద్దపిల్ల పుట్టి- ప్రపంచంలో ప్రతివిషయం అనంతమే అని చెప్తోంది-నూతన ప్రారంభం అన్నివిషయాలనూ అనంతం చేస్తుంది మరి-యీ జీవితం త్రికాలాలలోనూ-వుంటుంది.

...మధ్యాహ్నం భోజనాలయాక యిల్లూ సామాన్లూసర్ది అంసటు తీర్చుకొనే ప్రయత్నంలో వుంది. అన్నిపనులలోనూ సహాయంచేసి, ఆదివారంపూట పక్కయింటి పెద్దమనిషితో బాతాఖానీ వేస్తున్నాడు ఆయన. పెరట్లో తడకల దగ్గిర నుంచుని మాట్లాడుకుంటున్నారు. ఈ యింట్లోకి వచ్చిన దగ్గిరనుంచీ యిదే అలవాటు. ఆదివారం వచ్చిందంటే, భోజనం ముగించి, గునపమో పారో పట్టుకోడం, తడకల దగ్గిరకి వెళ్ళి పక్కింటాయనతో కబుర్లు చెప్పడం.

వంటయింటి కిందిమెట్టుమీదే కూర్చుంది. ఎండగావున్నా గాలి బాగా వేస్తోంది. ఎండ బాధ అనిపించడంలేదు...తడకలకేసిచూస్తోంది- ఆయనా పక్కింటిపెద్దమనిషీ మాట్లాడుకుంటూనే వున్నారు. తన కళ్ళల్లో పెద్దపిల్ల మెదులుతూనే వుంది ... దూరంగా ఆయనా, ఆడుకుంటూ ఎక్కడో పెద్దపిల్లా, తనలో కదిలే యీ శిశువూ, మిట్టమధ్యాన్నపు గాలీ వెలుగూ, వాటన్నిటి మధ్యా యింకోవ్యక్తి! యీ వ్యక్తి ఎవరు? యీ ప్రశాంతతమధ్య యీ వింతవ్యక్తి ఎందుకొస్తాడు? తనలోనే అలజడి కలిగించే శిశువుండగా, యీ పై అలజడికూడా ఎందుకు?...తడకల దగ్గిర ఆయనా ఎక్కడో ఆడుకుంటూ పెద్దపిల్లా... మధ్యని యీ వ్యక్తి!

ఎండమావిలాగ, తన ఆలోచనల మధ్య వుండుండి యీ వ్యక్తి ప్రత్యక్షమవుతూనే వుంటాడు...కొన్ని సమయాల్లో అతి సమీపంగానూ, ఎంత సమీపంగా అంటే ఈ వ్యక్తీ తనలోనే వున్నాడా అన్నంత సమీపంగా! దూరతీరాలనుంచి వినిపించే సంగీతంలాగా, కొండగుట్టల నుండి ప్రతిధ్వనించే ధ్వనులలాగా యీ వ్యక్తి ఎండమావిలా తనలోనే ప్రత్యక్షమవుతూ వుంటాడు. ఈ వ్యక్తిపట్ల తన ఆలోచనలు రహస్యంగా పని చేస్తాయి...తడకల దగ్గిర ఆయన యింకా మాట్లాడుతూనే వున్నాడు. పెద్దపిల్ల ఎక్కడో కేకలువేస్తూ ఆడుకుంటూంది...ఈ ఆలోచనలమధ్య మళ్ళీ త్వరలోనే తన బాధ ప్రారంభమవుతుందని తెలుసు...కళ్లు ఒక్కసారి మూసుగుని తెరిస్తే...ఎన్నో సంవత్సరాలైంది తను కళ్ళు మూసుకొని అనిపించింది. ఎన్నో సంవత్సరాలనాటి కలనుంచి ఇప్పుడే మెలుకువవచ్చిందా? ఆనాడు తను తప్పుచేసినా అది తనకి తెలియకుండానే చేసింది. ఆనాటి చర్యలన్నీ సుషుప్తావస్థలో విషయాలు...ఆయన తన ప్రాణం. తను

లేకుండా ఆయన బ్రతకలేడు. పెద్దపిల్ల లేకుంటే తనకి జీవితమేలేదు... మరి యీ వ్యక్తి? పాపం! అతన్ని చూస్తే జాలివేసి తన హృదయం ద్రవించింది. ఈ విశాలప్రపంచంలో దారి తెలియని ఏకాకి. పెద్ద పట్టణంలో దారి తెలియక ఏడిచే చిన్న పిల్లాణ్ణి ఎలా ప్రేమిస్తుందో అతన్ని అలా ప్రేమించింది. అటువంటి పరిస్థితిలో తను తన సర్వస్వాన్నీ అతనికి అర్పించిందంటే, తనలో మెదిలే యీ శిశువు అతని రూపంలోనే అవతరిస్తాడంటే... అన్నిటికీ కారణం తను స్త్రీ కాబట్టి. ఏం చేస్తుంది? తన హృదయం అలాంటిది... ఆలోచనల ప్రవాహం విరిగింది... మెట్లమీదనుంచి లేచి ఇంట్లోకి వెళ్ళింది. హాల్లో కిటికీలో నించుని చూస్తూంటే... అక్కడికీ... తడకదగ్గిర మాట్లాడే ఆయనా, ఎక్కడో కూనిరాగాలు తీస్తూన్న పెద్దపిల్లా...

తాము ముగ్గురూ ఆనాడు రైలుస్టేషను వైటింగు రూములో రైలురాకని ఎదురుచూస్తూ కూర్చున్నారు. ఆయన తండ్రికి జబ్బుగా వుందంటే చూడడానికి వెడుతున్నాడు. అతను ఆనాడు తన ప్రక్కనే కూర్చుని తనుకూడా ఆ జబ్బుగా వున్నవాని కొడుకులాగా, తనూ ఆ వూరు వెడుతున్నట్లూ బాధపడ్డాడు. రైలు రాకకోసం చూస్తూ, చాలా తక్కువ సంభాషణ జరిగింది. జబ్బుగావున్న మనిషిని చూడడానికి వెడుతూంటే ఉత్సాహం ఉండదు. కొంతసేపయాక ఆయనే అన్నాడు. "ఏం అంత ప్రమాదం అయుండదులే. ఓవారంలో వచ్చేస్తాను" అంటూండగానే రైలు వచ్చేసింది. తనని చూస్తూవుండమని, ఆయన రైలు యెక్కారు. రైలు వెళ్ళిపోతూంటే, అప్రయత్నంగా అతని కండ్లలో నీళ్లు తను చూసింది. ఎందుకు? ఎందుకు కంటతడి-తనకోసమా? వెళ్లిన ఆయనకోసమా? తనకి తెలుసు: తనని అతను ఆరాధిస్తాడని—స్నేహితుడిని గాయపరచడం యిష్టంలేకనే యిన్నాళ్లు రహస్యంగా వున్నాడు... అతనెంత రహస్యంగా వున్నా అతని కళ్లు చెప్తూనే వున్నాయి... ఆయన వూరికి వెళ్లినరాత్రి యిల్లంతా అయోమయంగా వుంది. అతను మానసికంగా అపరిమితంగా బాధపడుతున్నట్లు కనిపిస్తున్నాడు... ఒంటరితనాన్ని భరించలేని పిల్లవానిలా తనకళ్ళకి కనిపించాడు... అంతే - తను ఆయన భార్యగాకాక, ఇతని ఒంటరితనానికి సహచరిగా అతని బాహువుల్లో యిమిడింది...

హఠాత్తుగా తడకదగ్గిర నిల్చుని మాట్లాడే ఆయన కనిపించారు... అలా ఎందుకు జరిగిందో ఆయనకి చెప్పాలి-ఆయన అంతా అర్థంచేసుకోవాలి... తనెలా అర్థం చేసుకుందో ఆయనా అలాగే అర్థంచేసుకోవాలని... అంతేకాని ఒళ్ళు తెలియని కోపంతో దహించుకు పోకూడదు. అంతా తెలిసీ ఆయన ఎవరినీ అసహ్యించుకోకూడదు. తనని, ఆయనని, అతన్ని ఎవరినీకూడా. ...ఆలోచనల బరువు అధికంగా వుంది... చేయడానికి ఎన్నో పనులున్నాయి. ముఖ్యమయినవి కాకపోయినా సంతోషాన్ని యిచ్చేవి... పెద్దపిల్లని తల్చుకుంటే ... ఆమెని పిలిచి ఒకసారి చూడాలని తోచింది. తన కూతురు తనదగ్గిర వుండాలి. తనతో మాట్లాడుతూ వుండాలి... వీధి గుమ్మంలోకి వెళ్లి కేక వేసింది. అవును. దానికేం అర్థంకాదు ఎందుకు పిలిచిందో తను... ఏదో పనిచెప్తుంది...ఒగర్చుకుంటూ పరిగెత్తుకు వచ్చింది పెద్దపిల్ల "ఏమమ్మా?" .. "చూడు ఆ సందు మలుపుతిరిగితే మంచి పళ్ళకొట్టువుంది. పోయి పళ్లు కొని తెస్తావా?"

"ఓ, నాకిప్పుడేకదూ, రూపాయిణా పైసలు లెక్కలు చెప్తాంటు?" అంది సగర్వంగా. డబ్బులు చేతిలో పెట్టడమే తరవాయి, పరిగెత్తింది... అక్కడే నిల్చుని చూస్తూంది తను. చిన్న పాదాలని గబగబ నడిపిస్తూ వెళ్లిపోతోంది పెద్దపిల్ల... ఆయనతడకలదగ్గిర పక్కింటాయనతో మాట్లాడుతూనేవున్నారు- ఒక్కసారి లోపలికిరమ్మంటే? ఆదివారంపూటా మాట్లాడుకోనీ హాయిగా. వెళ్లి మంచంమీద నడుంవాల్చి కళ్లుమూసింది. తనలో అలజడిచేసే పసిప్రాణీ, దూరంగా నడిచివెళ్లిన పెద్దపిల్లా, తడకదగ్గర నుల్చుని మాట్లాడుతున్న ఆయనా... వీరందరి మధ్యా ఎండమావిలా కనీ కనిపించని... ఆ వ్యక్తీ... ఎప్పుడు పట్టిందో నిద్ర మెలుకువ వచ్చేటప్పటికి నాలుగవుతోంది. హాల్లో తండ్రీ కూతురు కూర్చుని పండ్లు ఒలుచుకు తింటున్నారు... ★